



డా.తంగిరాల మీరా సుబ్రహ్మణ్యం

# తీరిన కోరిక

"మామయ్యగారూ కాఫీ" అంటూ గదిలోకి వచ్చిన రమ్య మామ గారు మూతిని ముందుకు వంచి, కుడి చేతి రెండువేళ్ళు నోట్లోపెట్టుకుంటూ కన బడేసరికి కంగారుపడి "అత్తయ్యగారూ! ఒకసారి ఇలా రండి" అని పిలుస్తూ లోప లికి పరిగెత్తింది.

"రాత్రి బాగా గుర్రుపెడుతూ నిద్రపో యారు. ఇందాకా టిఫిన్ తినేటప్పుడూ బాగానే వున్నారు. ఇంతలోనే ఏవయ్యిం దండీ? నోట్లో వేళ్ళుపెట్టి వాంతి చేసుకో వడానికి ప్రయత్నిస్తున్నారా ఏమిటి? కడుపులో వికారంగా వుందా? తిన్నది బయటకు వచ్చేస్తే బాగుండననిపి స్తోందా?" కోడలి మాటలు వినగానే హడావుడిగా వచ్చిన వరప్రసాదిని భర్త పరంపరరావు వీపునిమురుతూ ఆదు ర్దాగా అడిగింది.

పరంపరరావు అయోమయంగా చూసాడు.

"నాకేవయింది? బాగానే వున్నాను" అన్నాడా యన.

"అయ్యో అత్తయ్యా! బాబిగాడి పుట్టినరోజు గనుక ఇవాళ పెరుగువడలు చేస్తానని పప్పుకూడా నానబోసారు. కాజాలు చేయాలని పిండికలిపి పెట్టారు. మరి ఇప్పుడెలా?" దిగులుగా అడిగింది రమ్య.

"ఆయనకు కాస్త అజీర్తి చేసిందని పసివాడికిష్ట మైన పిండి వంటలు చేయడం మానేస్తామా ఏమి టమ్మా? అంతగా అయితే ఈ పూటకు మీ మావ య్యకు మిరియాల చారు అన్నం పెడతాను. అజీర్ణం అయిపులేకుండా పోతుంది" అంది వరప్రసాదిని.

"నాకేమీ కాలేదంటే నమ్మరేం? సుబ్బరంగా గుండ్రాయిలా వున్నాను" తన కిష్టమైన వంటకాల పేర్లు వినగానే నోట్లో నీళ్ళూరిన పరంపరరావు గుట కలు మింగుతూ అన్నాడు.

'మీ సంగతి నాకు తెలుసులెండి' అన్నట్టుగా ఆయన్ని చూసి వంటింట్లోకి నడిచింది వరప్రసా దిని. అత్తగారిని అనుసరించింది రమ్య.

'భోజనాల వేళకు ఈ విషయం ఎవరికి గుర్తుం టుందిలే' అనుకుని మనసు స్థిమిత పరచుకుని, గది తలుపు దగ్గరగా వేసి వచ్చి కిటికీ ముందు కుర్చీలో కూర్చున్నాడు పరంపరరావు.

బొటనవేలు లాభం లేదనుకుని ఈసారి చూపు డువేలునీ, నడుమ వేలునూ జంటగా నోట్లోకి దూర్చి ప్రయాసపడుతుండగా గది తలుపులు త్రోసు కుని లోపలికి వచ్చాడు ఆయన కొడుకు రంగా రావు.

"వుష్ వుష్ అంటున్నావు. పిల్లిగానీ లోపలికి వచ్చిందా నాన్నా?" అంటూనే ఆయన వైపుచూసి "మళ్ళీ నోట్లో వేళ్ళు పెట్టుకుంటున్నారు. గొంతులో ఏదైనా అడ్డుపడినట్టుగానీ వుందా? లేక ముల్లు గుచ్చుకున్నట్టు వుందా? అలా అయితే ఒక డోసు 'హెపార్‌సల్ఫ్' తగిలిస్తే సరిపోతుంది కదా..లేక నాలుకమీద వెంట్రుకో, దారమో వున్న ఫీలింగ్ వుంటే 'శైలీషియా' రెండు వందల పొటెన్సీలో పడితే పది నిముషాల్లో తగ్గిపోతుందంటారుగా" అంటూ సలహా ఇచ్చాడు.

తండ్రీ కొడుకులిద్దరూ హోమియోపతి వైద్యం గురించి బాగా పుస్తకాలు చదివి ఇంటివైద్యం చేస్తూంటారు. రంగారావు ఒక అడుగు ముందుకు వేసి తన గదిలో 'హానిమన్'గారి ఫోటో తగిలించుకు న్నాడు. 'మెటీరియా మెడికా', 'బెడ్‌సైడ్ ప్రిస్క్రైబరు' తండ్రి కొడుకులిద్దరూ గీతా పారాయణంలా నిత్యం చదువుతుంటారు.

"అబ్బా! నాకేమీ కాలేదురా..కాసేపు నన్ను మాట్లాడించకుండా వంటరిగా వదిలేసి నీ పని చూసుకో" విసుగ్గా అన్నాడు పరంపరరావు.

రంగారావు బయటకు వెళ్ళగానే లోపలికి వచ్చాడు పరంపరరావు మనవడు వాసు. "నాకిస్తా నన్న బహుమతి ఇంకా ఎన్నాళ్ళకిస్తావు తాతయ్యా" గొంతు తగ్గించి అడిగాడు వాసు.

"బహుమతి సరేగానీ నీ పుట్టిన రోజుకి ఏం తెచ్చానో చూడు" అంటూ మంచం క్రింద నుండి పొడుగాటి అట్టపెట్టెను బయటకు లాగి మనవడికి అందించాడు పరంపరరావు.

"తాతయ్యా యు ఆర్ గ్రేట్.." అంటూ ఆయన ఇచ్చిన క్రికెట్ సెట్ చూసి సంబరపడి పోయాడు పదేళ్ళ వాసు.

"అందరికీ చూపించి వస్తాను తాతయ్యా!" అంటూ పరిగెత్తి వెళ్ళాడు.


భోజనాల వేళయింది. పిండి వంటల తాలూకు ఘుమ ఘుమలు ఇల్లంతా కమ్ముకుని నోరూరిస్తు న్నాయి. ఎప్పుడెప్పుడు వడ్డిస్తారా అని ఎదురు చూస్తూ అటూ ఇటూ తిరుగుతున్నాడు పరంపర రావు.

"పెసలు పురుగు పడుతున్నాయని పైన ఎండలో ఆరబోసి వచ్చాను. కోతులుగానీ వచ్చా యంటే గింజ చేతికి దొరకదు. ఒక అరగంట మేడ మీదకి వెళ్ళి కర్ర చేతిలో పట్టుకుని నీడలో కూర్చోండి" అంటూ 'నీవేదిక్కు' అన్న తీరులో అడిగి మొగుడిని మేడమీదకి పంపింది వరప్రసా దిని.

అరగంట తరువాత ఆవిడ ఆయాసపడుతూ మెట్లెక్కి వచ్చి "మీరు క్రిందకి పదండి..కాసేపు వాసు కాపలా కూర్చుంటాడు" అంటూ ఆయన వైపు చూసేసరికి ఆయన మళ్ళీ నోట్లో రెండువేళ్ళు పెట్టుకుని కనబడ్డాడు.

"రంగా చెప్పినప్పుడే అనుకున్నాను. ఇంకా సర్దుకో లేదా మీకు? అందుకే అందరి భోజనాలు అయినాక మిమ్మల్ని పిలవడానికి వచ్చాను" అంది వరప్రసాదిని ఆయన దగ్గరగా వచ్చి.

పరంపరరావు వులిక్కిపడ్డాడు. "అదేమిటే నన్ను పిలవకుండా అందరూ భోజనాలు చేసేసారా? ఏం



ఎందుకని? వాసుపుట్టినరోజున నేను లేకుండా వాళ్ళకి అన్నాలు పెట్టేసావా?" అన్నాడాయన నమ్మలేనట్టుగా చూస్తూ.

"అందరికీ రకరకాల పిండివంటలు వడ్డించి, మీకు మాత్రం చారు అన్నం పెట్టాలంటే నాకు మనసెలా ఒప్పుతుందండీ. అందుకే మిమ్మల్ని మేడమీదకి పంపి వాళ్ళకు భోజనాలు వడ్డించాను. సరే పదండి" అంది వరప్రసాదిని అనునయంగా.

ఆయనక్రిందకు రాగానే ఒక గిన్నెలో జావలాగా వున్న మిరియాల చారు అన్నం అందించిందావిడ.

"నాకేమీ రోగం లేదంటే నమ్మరేమిటే? అసలు.." అంటూ ఆయన ఏదో చెప్పబోయేంతలో వాసుకి గుక్క తిప్పుకోలేనంతగా దగ్గొచ్చింది.

రమ్య పరుగెత్తి వచ్చి, కొడుకు తల మీద అరచేతితో తట్టి, మంచినీళ్ళ గ్లాసు నోటి కందించింది.

వాసు వైపు చూస్తూ పరంపరరావు ఏమీ మాట్లాడకుండా డైనింగు టేబులు ముందున్న కుర్చీలో కూలబడ్డాడు. 'అసలు సంగతి చెప్పేద్దామంటే వద్దంటూ వాసు వార్నింగు' అనుకుంటూ.

"ఈ పూటకి నా మాట వినండి. రాత్రికి కావాలంటే భోజనం చేద్దురు" ప్రేమగా ఆయన చేతికి మిరియాల చారు అన్నంజావ వున్న గిన్నెను అందించింది వరప్రసాదిని.

"సరే నా ఖర్మ బాగోలేక ఈ పూట పథ్యం తింటున్నాను. కష్టపడి అన్ని పిండివంటలు చేసిన దానివి నువ్వెందుకూ కడుపు మాడ్చుకోవడం?" ఆకలిమీద వున్న పరంపరరావు ఆ జావనే పరమాన్నం లాగా తాగేసి కాస్త చల్లబడి అన్నాడు.

"మీరింత అవస్థ పడుతున్నా నాగురించి ఆలోచిస్తున్నారా?" గద్గదికంగా అంటూ చీరకొంగుతో కళ్ళు తుడుచుకుంది వరప్రసాదిని.

"మేమందరం పట్టుబడితే అత్తయ్యగారు కూడా మాతోబాటే భోజనం చేసేసారు మావయ్యా" చల్లగా చెప్పింది రమ్య.

మిరియాల చారు ఘాటుకో, తనమీద వాళ్ళందరికీ వున్న ప్రేమకో మరి పరంపరరావుకీ కళ్ళనీళ్ళు తిరిగాయి. కుర్చీమీద వున్న తువాలుతో కళ్ళు తుడుచుకుని నీరసంగా మంచం మీద వాలాడాయన.

మిగిలిన వారంతా భుక్తాయాసంతో నిద్రకు వుపక్రమించారు.

సాయంకాలం కాఫీ మాత్రం అందరితోబాటు ఆయనకూ ఇచ్చింది అర్ధాంగి.

"శైలీషియా, హెపార్‌సల్ఫ్ పని చేసినట్టున్నాయి కదూ నాన్నా" తన మందు రామబాణంలా గురి తప్పదన్న సంతోషంతో అడిగాడు రంగారావు.

తన చేతి వేళ్ళ వైపు చూసుకుని, ఒకసారి వాసుకేసి చూసి 'అవును' 'కాదు' కు మధ్యలో తల వూపాడు పరంపరరావు.

హాల్లో కూర్చున్న వాసు పక్కన కూర్చుని ఆయన మనవరాలు హారిక కళ్ళార్పకుండా టి.వి.లో వస్తున్న క్రికెట్ మాచ్ చూస్తోంది.

"హాయిగా 'అష్టా చెమ్మ'లాంటి ఆటలు ఆడుకోక ఈ కాలం ఆడపిల్లలకు ఈ క్రికెట్

పిచ్చి పట్టిందే?" అంటూ హారిక, పక్కన కూర్చున్నాడాయన.

"అది 'కలర్స్ స్వాతి ఆట తాతయ్యా.. సారీ సినిమా" అంది పదహారేళ్ళ హారిక తల తిప్పకుండానే.

అంతలో ధోనీ సిక్సర్ కొట్టడంతో ఆనందం పట్టలేక సన్నగా ఈలవేసి, నాలుక కరచుకుని, తండ్రివైపు దొంగ చూపులుచూసింది.

రంగారావు కూతురి వైపు మందలింపుగా చూసి "ఇదేనా నీ పెంపకం?" అన్నట్టు రమ్యవైపు చూసాడు.

"ఈల వేయడం, ఎప్పుడు నేర్చుకున్నావే అమ్మలూ? ఏదీ మరోసారి వేయి చూద్దాం" పరంపరరావు ఉత్సాహంగా అడిగాడు.

"ఏమిటి నాన్నా? ఆడపిల్లవు రౌడీ వేషాలు వద్దు అని చీవాట్లు వేయక, ఘనకార్యం చేసినట్టు మెచ్చుకుంటున్నారు?" రంగారావు ఆశ్చర్యపడిపోతూ తండ్రిని అడిగాడు.

రంగారావుకు బాగా గుర్తుండిపోయిన సంఘటన అదే.

అంతకుముందు ఎన్నడూ తండ్రిని అంత కోపంగా చూడలేదతను. అతను డిగ్రీ చదివేటప్పుడు ఒకరోజు స్నేహితులతో సినిమాకు వెళ్ళినప్పుడు ఏదో నాటు డాన్సు వస్తుంటే ఈల వేసాడు. ఆ రోజు అదే సినిమాకు తన తండ్రి వచ్చాడనీ, తమ వెనకనే కూర్చున్నాడనీ అతనికి ఇంటికెళ్ళాక తెలిసింది.

ఇంటికి రాగానే తల వాచేట్టు రంగారావుని చీవాట్లు పెట్టాడు పరంపరరావు. మరోసారి రౌడీ వేషాలు వేస్తే ఇంట్లో నుండి తరిమేస్తానని వార్నింగు ఇచ్చాడు కూడా.

అటువంటి ఆయన ఇప్పుడు ఆడపిల్ల, అదీ తన మనవరాలు ఈలవేస్తే 'వన్స్‌మోర్' అని అడుగుతుంటే అతనికి ఆశ్చర్యంగా వుంది.

"అలా అడిగినప్పుడల్లా వేయలేను తాతయ్యా! నాకు పట్టలేని సంతోషం కలిగితేనే.." అంది హారిక సిగ్గుపడుతూ.

"అయినా అంత సులువుగా ఎలా వేసేయగలిగావు? అసలు" అంటూ ఆయన ఏదో అనబోయేంతలో వాసు దగ్గడం మొదలుపెట్టాడు.

"ఏమిటో వీడిని పొద్దుటి నుండి ఎవరో తెగ తలచుకుంటున్నారు. ఒకటే పొరబోయి దగ్గొస్తోంది" అంటూ వాసుకి మంచినీళ్ళు అందించింది రమ్య.

పరంపరరావు అక్కడి నుండి లేచి మెల్లిగా మెట్లు ఎక్కి మేడమీదకి వెళ్ళాడు.

"అమ్మయ్య అందరూ క్రికెట్ చూస్తున్నారు. ఇప్పుడు ఎవరూ పైకిరారు" అని నిశ్చింతగా అనుకుంటుండగానే ఆయనకు వెక్కిళ్ళు మొదలయ్యాయి.

వెక్కుకుంటూ క్రిందకు దిగి వచ్చిన మొగుడి వైపు అనుమానంగా చూస్తూ మంచినీళ్ళు అందించింది వరప్రసాదిని.

ఆయన అప్రయత్నంగానే తన చేతి వేళ్ళవైపు చూసుకున్నాడు.

"తాతయ్యా! రేపు నాకు ఇంకో బహుమతి తప్పక ఇస్తావు కదూ?" వున్నట్టుండి అడిగాడు వాసు.

తాతా మనవళ్ళ వైపు అయోమయంగా చూసారు మిగిలిన నలుగురు కుటుంబ సభ్యులూ!

మర్నాడు ఉదయం అయిదున్నర గంటలకే నిద్రలేచి ఆరింటికల్లా ఉదయపు నడకకు బయల్దేరాడు పరంపరరావు.

గేటుదాటి రాగానే రోడ్డుకి అటువైపున ఠీవిగా నిలబడిన రావి, వేపచెట్ల కొమ్మల మీది పక్షుల కువకువా రావాలు ఆయనకు స్వాగతం పలికాయి.

ఆయన స్వహస్తాలతో నాటి పెంచిన చెట్లు అవి. బిందెలతో నీళ్ళు భుజాన మోసి వాటికి పోసి, అల్లరి పిల్లలు కొమ్మలు విరిచేయకుండా ముళ్ళ కంచె వేసి కాపాడి పెంచాడు.

గాలికి తలలూపుతూ ఆనందపారవశ్యంతో నాట్యం చేస్తున్నట్టు కదిలే పచ్చని కొమ్మల్ని చూస్తుంటే ఆయన మనసు సంతోషంతో నిండిపోయింది.

ఆదివారం కావడాన ఇంకా ఎవరూ నిద్ర లేవలేదు.

వీధంతా నిర్మానుష్యంగా వుంది. తమ వీధి దాటి పక్కవీధిలో ప్రవేశించి నడక సాగిస్తున్న పరంపరరావుకి మనవడి మాటలు గుర్తొచ్చేయి. 'వాడి ముందయినా పరువు నిలబెట్టుకోగలడా?' అనుకుంటూ చివరి ప్రయత్నంగా బొటన వేలు చూపుడు వేలు కలిపి నోట్లో పెట్టుకున్నాడు. బలంగా గాలి వదిలాడు.

'వుష్ వుష్' అన్న శబ్దం బదులు బయ్యిమన్న



## నిజమేనా?

ఐశ్వర్యారాయ్ నటిస్తున్న 'యాక్షన్ రీప్లే' సినిమాలోని ఓ పాటలో ఏకంగా 125 రకాల డ్రెస్సుల్లో కనిపిస్తుందని బాలీవుడ్డంతా తెగ చెప్పేసుకుంటున్నారు. ఒక్క పాటలో ఇన్ని డ్రెస్సులతో ఎలా కనిపిస్తుందబ్బా అని ఆశ్చర్యపోతే ఇక మనవేం చేయలేం కదా! ఈ సంగతిని ఆ చిత్ర దర్శకుడు విపుల్ షా కూడా డప్పుకొట్టి మరీ చెబుతున్నాడు. చాలా కాలంగా నిర్మాణంలో వున్న ఈ సినిమాకి ఇలాంటి ఎన్నెన్నో ఆకర్షణల్ని పెడుతున్నారట దర్శక నిర్మాతలు. మరి సినిమా ఏమవుతుందో!

ఈల శబ్దం ఆయన నోట్లోనుండి వెలువడింది.

నాలుగు రోజులుగా పట్టువదలని విక్రమాదిత్యుడిలా ప్రయత్నిస్తున్నా రానిది ఈరోజు ఈల పాటు రఘురామయ్య వారసుడిలా ఈల వేయగలగడం ఆయనను ఆనందాశ్చర్యాలలో ముంచేసింది.

నిజంగానే తనకు ఈల వేయడం వచ్చేసిందా అన్న అనుమానంతో నోట్లో వేళ్ళు పెట్టుకుని మరో సారి ఖయ్యిమని ఈలవేసాడాయన. ఇన్నేళ్ళ తర్వాత వాసు ఈల విని ఆయనను ఈల దోమకుట్టింది.

ఎన్నాళ్ళ కల? ఎన్నేళ్ళ కోరిక..ఇప్పటికి తీరింది. విసుక్కోకుండా పదే పదే తనకు నేర్పిన వాసుకి మంచి బహుమతి ఇవ్వాలి.

"మగ పుట్టుక పుట్టి ఈలవేయడం రాదా?" అని వెక్కిరించిన స్నేహితులు శోభనం నాడు అప్పరసలా వచ్చిన వరప్రసాదిని అందం చూసి ఈలవేయబోయి భంగపడితే నిరాశగా చూసి జాలిగా నవ్విన భార్య. తనకు రానిది తన కొడుకు సినిమా హాల్లో ఈల వేయడమా అని వాడిని ఎలా కోప్పడ్డాడు? ఈరోజు తన మనవరాలు ఈలవేస్తే వాసు ముందు ఎంత అవమానంగా అనిపించింది? నిజంగానే తను ఈల వేయగలుగుతున్నాడు...

ఆలోచనలు ముసురుతుంటే మనసు నిండిన విజయోత్సాహంతో తాను వీధిలో నడుస్తున్నానన్న స్పృహ లేకుండా వరుసగా మరో నాలుగుసార్లు ఈల వేసాడాయన.

వరుసగా ఆ వీధిలోని ఇళ్ళ తలుపులు తెరుచుకున్నాయి. చెత్తనింపిన ప్లాస్టిక్ డబ్బాలు, బకెట్లు చేత బట్టుకుని ఇళ్ళలోని గృహిణులు ఆవులిస్తూ వీధి గుమ్మాలలోకి వచ్చి అటు ఇటు చూడసాగారు.

"ఈల వినబడింది కదూ వదినా! ఏడీ చెత్త తీసుకుని వెళ్ళే అతని బండి కనబడదేం?" అంటూ పక్కింటావిడను అడిగిందొక ఇల్లాలు.

ఇళ్ళలోని చెత్తని బండిలో వేసి తీసికెళ్ళే అతను ప్రతి ఇంటిముందూ ఆగి పిలవలేక డ్రిల్ మాస్టర్లా విజిల్ వూది తన రాకను ముందుగానే తెలుపుతాడు. ఆ విజిల్ శబ్దం వినగానే అలస్యం లేకుండా అందరూ ఇళ్ళలోని చెత్తడబ్బాలు బయటకు తెచ్చేస్తారు.

"రెండ్రోజుల నుండి చెత్తబండి రాలేదు కదా..ఇవాళ తొందరగా వచ్చాడేమో అనుకున్నాను" అంటూ వీధిలోకి అటూ ఇటూ పరీక్షగా చూసింది మరొక ఇల్లాలు.

పరంపరరావు ఠక్కున నోట్లో నుండి వేళ్ళు తీసేసాడు.

'ఆ ఈల తనే వేసాడని వాళ్ళకు అనుమానం గానీ వస్తే' అనుకుంటేనే ఆయనకు చెమటలు పట్టేసాయి.

గబగబ నడిచి తమ ఇల్లు వున్న వీధి మలుపు తిరిగాడు. బండి వచ్చిందనుకొని రమ్య కూడా చెత్త డబ్బా తీసుకొచ్చి బయట నిలబడి వుంది.

అమ్మవెనకాలే పరిగెత్తుకు వచ్చిన వాసుకి చెత్తబండి కనబడకపోవడం, తాతయ్య కంగారు చూడగానే దగ్గొచ్చింది. డబ్బాను క్రింద పెట్టి మంచినీళ్ళు తేవడానికి లోపలికి వెళ్ళింది రమ్య.

'జయం మనదే' అన్నట్టు బొటనవేలు పైకెత్తి మనవడికి చూపి నవ్వాడు పరంపరరావు. మనవడి ముందు వాడు నేర్పిన విద్య ప్రదర్శించాలన్న వుత్సాహంతో నోట్లో వేళ్ళు పెట్టుకుని 'ఖయ్యి' మని ఈల వేసాడు.

అప్పుడే బయటకు వచ్చిన వరప్రసాదిని ఆ అపురూప దృశ్యాన్ని చూసి అవాక్కై నిలబడింది.

శోభనం నాడు తన అందం చూసి ఈలవేయబోయిన మొగుడి కోరిక ఆయన తాత అయ్యాక తీరినందుకు మురిసిపోతూ 'విజయ హారతులివ్వనా? వీర తిలకం దిద్దనా?' అన్నట్టు ఆయన వైపు ఆరాధన నిండిన చూపులతో చూసింది.

భార్య ఆనందం చూడగానే వుత్సాహం పట్టలేక మరొకసారి నోట్లో వేళ్ళు పెట్టి ఈలవేసి, చుట్టుపక్కల వాళ్ళు చెత్త డబ్బాలతో బయటకు వస్తారేమోనన్న కంగారుతో గభాలున ఇంట్లోకి దూరాడాయన.

ఎదురొచ్చిన కొడుకు, కోడలు, మనవరాలి చూపుల్లో నవ్వుల మతాబాలు ఆయనకు స్వాగతం పలికాయి.

○

## కమలినీ డైరెక్షన్?

బెంగాలీ భామ కమలినీ ముఖర్జీకి తెలుగులో అవకాశాలు బాగా తగ్గిపోయిన సమయంలో తాజాగా మంచి ఆఫర్ వచ్చింది. వెంకటేష్ హీరోగా రూపొందుతున్న 'ఆప్త రక్షక' (చంద్రముఖి సీక్వెల్) కన్నడ చిత్రం తెలుగు వెర్షన్‌లో ప్రధానమైన దెయ్యం పాత్ర చేస్తోందిట. వేషం చిన్నదే అయినా సినిమాలో అత్యంత కీలకమైందనే ఆ పాత్ర చేస్తున్నట్టు చెబుతున్న కమలినీకి భవిష్యత్తులో సినిమా డైరెక్ట్ చేయాలనే కోరిక వుందిట. అన్నీ కలిసొస్తే తనదైన అభిరుచితో ఓ సినిమాకి దర్శకత్వం వహించాలనుందంటోంది.

